

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 11 పుష్పం : 32-35 20-05-2001

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16
**VOL : 6** **ISSUE : 11**
EDITOR
**P.S. RAMA RAJU**
EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)
**SUBSCRIPTION**
Yearly : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**
**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.
**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689
**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## మోక్షం ఎవరిని వరిస్తుంది

అది ఒరిస్సా సముద్ర తీరం. శ్రీ చైతన్య ప్రభువు కృష్ణ నామ సంకీర్తనం అలౌకిక ఆనందంతో, నృత్యంతో చేస్తున్నారు. వారు చేసే నామం అప్రయత్నంగా (Effortless), తైలధారలా (CONTINUOUS, WITHOUT BREAK), అనన్య భక్తితో, వస్తువుమీద పరమ ప్రీతితో, నామం చేసేవాడు లేకుండా (No Doer ship) నామం జరుగుతోంది. అంతలో ఒక భక్తుడు వచ్చి యాధాలాపంగా (Casual) నాకు భగవంతుడిని చూపిస్తారా అన్నాడు. సరే అని శ్రీ చైతన్య ప్రభువు, ఆ భక్తుని సముద్రంలోపలికి కొంతదూరం తీసుకువెళ్ళి, మెడ పట్టుకొని, తలను నీటిలోముంచి, ఆ భక్తుడు గిలగిలా కొట్టుకున్నప్పటికి, బలవంతంగా అతనిని నీటిలో ఉంచాడు. అతడింక చనిపోతాను అనుకున్న సమయంలో అతనిని వదిలాడు. భక్తుడు ఆయాసం తీర్చుకున్నాక, ఆశ్చర్యంతో, ఇదేమిటి స్వామీ? భగవంతుడిని చూపించమంటే నన్ను ఇలా ఇబ్బంది పెట్టారు అన్నాడు. అప్పుడు శ్రీ చైతన్య ప్రభువు, భక్తునితో ఇలా అన్నారు. నీవు నీటిలోఉండి కొట్టుకున్నప్పుడు నీ మనస్సు దేనిమీద ఉంది అన్నారు. ఇంక దేనిమీద ఉంటుంది, గాలి ఎలా పీల్చుకొందామా అనే దృష్టి ఒకటే ఉంది అన్నాడు భక్తుడు. శ్రీ చైతన్య ప్రభువు భక్తునితో ఇలా అన్నారు. నువ్వు నీటిలో ఉన్నప్పుడు గాలికోసం ఎంత పరితపించావో, అట్లే భగవంతుని కోసం అంత తపన ఉంటే, భగవంతుని అనుగ్రహం నీకు కలుగుతుంది. అంతేకాని భగవంతుడు మన ఆలోచనకు ఒక విషయము (Object) కాదు. అట్టి తపన కలవారిని మోక్షం తప్పకుండా వరిస్తుంది.

**ఈ సంచికలో..............**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**

21-11-2000 మురమళ్ళ .................... 2
12-01-2001 ఏలూరు .................... 5
19-01-2001 మల్కిపురం .................... 9
22-11-2000 మురమళ్ళ .................... 14

# ఆధ్యాత్మిక క్రమశిక్షణ వల్ల మనస్సుకు ఏకాగ్రత వస్తుంది

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు. 21-11-2000, మురమళ్ళ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతునిపట్ల మనకు ఉన్న ప్రేమను భక్తి అంటారు. జీవితంలో మనకు భక్తి ఎంతో ముఖ్యం. భక్తివల్ల శాంతి కలుగుతుంది. భక్తివల్ల ముక్తి కలుగుతుంది. భక్తిద్వారా మనం భగవంతునిలో ఐక్యమవ్వాలి. అదొక్కటే మనం చూసుకోవాలి కాని మూఢనమ్మకాలకు అవకాశం ఇవ్వకూడదు. భగవంతునియందు మనకు ఉన్న ప్రేమను పెంచేవారే నిజమైన గురువులు. మనకు ఎవరో ఒకరిమీద ప్రేమ ఉంది అనుకోండి నెమ్మదిగా ఆ ప్రేమను విశ్వవ్యాప్తం చేసుకోవాలి. దైనందిన జీవితంలో మనం చేసుకొనే పనిలో అశ్రద్ధ ఉండకూడదు. కర్మకు జ్ఞానానికి విరోధం లేదు, భక్తికి జ్ఞానానికి విరోధం లేదు. వర్తమానకాలం వదిలేసి భవిష్యత్ గురించి ఆలోచించటం వలన భయం వస్తుంది. భవిష్యత్ బాగుపడాలంటే వర్తమాన కాలాన్ని జాగ్రత్తగా, మెలుకువగా ఉపయోగించుకోవాలి. అజాగ్రత్త, అవినయం, గర్వం లేకుండా చూసుకోవాలి. ఈ జన్మను సద్వినియోగం చేసుకొంటే రాబోయే జన్మల గురించి ఆలోచించనక్కరలేదు. అందుచేత వర్తమానకాలంలో జీవించటం నేర్చుకోవాలి. ప్రతీదీ ఈశ్వరసంకల్పంతోనే జరుగుతోంది అని మనకు అర్థమయితే ఇంక దుఃఖం రాదు. ఈశ్వరసంకల్పంపట్ల ఎవరికైతే సజీవమైన విశ్వాసం ఉందో, ఈశ్వర సంకల్పాన్ని ఎవరైతే గౌరవిస్తున్నారో వారు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. మీ దేహప్రారబ్ధాన్నిబట్టి ధనం, గౌరవం వస్తే రానివ్వండి వాటితో మీరు తాదాత్మ్యం చెందకుండా చూసుకోండి. తాదాత్మ్యం చెందితే గర్వం వస్తుంది, దేహబుద్ధి పెరుగుతుంది. మనం చేయవలసిన సాధన ఏమిటి అంటే దేహబుద్ధిని తగ్గించుకొంటూ రావాలి. దేహబుద్ధి నశించిన వెంటనే మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది.

మనం జీవితంలో రెండు పనులు చేయటం నేర్చుకోవాలి. 1. మన పొట్టకోసం ఇతరులమీద ఆధారపడకుండా మన పని మనం చేసుకొంటూ జీవించాలి. 2. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకొంటూ అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ఏ వాసనలు, ఏ బలహీనతలు అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికి వేగ్గిమవ్మ్ ప్రయత్నం చేయాలి. శరీరాన్ని, మనస్సును ఆత్మజ్ఞానసముపార్జనకు ఉపయోగించుకోవాలి. జీవితయాత్రకు ఏదో పని చేసుకొంటూ ఉండాలి. ఆ పనే మన ధ్యేయం కాదు. ఈ జన్మలో కాకపోయినా, మరోజన్మలో అయినా, ఇటువంటి శరీరాలు ఎన్నివచ్చిపోయినా మనం పొందవలసినస్థితి వేరే ఉంది. అదే మోక్షస్థితి. దానిని మనం మర్చిపోకూడదు. ఇప్పుడే మనం దానిని పొందాలి. ఇప్పుడు పొందలేకపోయినా కనీసం మరణానంతర జీవితానికి తగిన పునాదులు వేసుకొంటూ జీవించాలి. మీకు భయం

వస్తూఉంటే, అసూయ వస్తూఉంటే అవి జీవలక్షణాలు, అవి ఈశ్వరలక్షణాలు కాదు. ఈశ్వరస్వరూపం పొందాలంటే ఈశ్వరలక్షణాలు పెంచుకొంటూ రావాలి. జీవలక్షణాలు పెంచుకొంటూ ఉంటే ఈశ్వరుడు ఆయన స్వరూపాన్ని మీకు ఎలా ఇస్తాడు ? మనం ఏదిచేసినా భగవంతుని ప్రీతికోసం చేయాలి. మనలో ఉన్న గుణాలు ఒకేసారి తగ్గవు. నెమ్మదిగా వాటిని తగ్గించుకొంటూ రావాలి. ఇతరుల అనుభవాలను, ఇతరుల వివేకాన్ని, శాంతిని ఎవరైతే తమ సొంతం చేసుకొంటున్నారో వారు తొందరగా గుణాల నుండి బయటపడతారు. ఇతరులు ఎవరైనా దుఃఖపడుతూ ఉంటే వారు ఎందుకు దుఃఖపడుతున్నారు ? ఫలానా పొరపాటు వలన వారికి ఇంత దుఃఖం వచ్చింది అందుచేత మనం అది చేయకూడదు అనే బుద్ధి మనకు ఉండాలి. అలా ఇతరుల అనుభవాలను సొంతం చేసుకొన్నవారు తొందరగా మోక్షానికి అర్హులవుతారు. కొంతమందికి వారిదాకా వస్తేనేగాని ఏమీ తెలియదు. సత్వగుణం ఉన్నవారితో సహవాసం చేస్తూఉంటే, వారి మాటలు శ్రద్ధగా శ్రవణంచేస్తే సాధకుడికి సత్వగుణం వస్తుంది. సత్వగుణం వచ్చినప్పడు దానిని జాగ్రత్తగా పోషించుకొంటూ అది ఎక్కువకాలం ఉండేలా చూసుకోవాలి. సత్వగుణం కూడా గుణమే కాని భగవంతుని దగ్గరకు దారి చూపించి అది ప్రక్కకు తప్పకొంటుంది.

పూజలు, జపాలు, ధ్యానాలు, సత్పురుషుల సహవాసం ఇవి అన్నీ మనస్సుకు క్రమశిక్షణ నేర్పటానికే. క్రమశిక్షణ వలన మనస్సుకు ఏకాగ్రత వస్తుంది, పవిత్రత వస్తుంది, మనస్సు సూక్ష్మమవుతుంది. అప్పడు మనస్సు బయటకు వచ్చే బదులు ఎక్కడైతే పరమేశ్వరుడు ఉన్నాడో ఆ హృదయగుహలోనికి వెళుతుంది. మనస్సు అక్కడకు వెళ్ళేవరకు ఇలా శరీరాలను మోస్తూ, కష్టసుఖాలను అనుభవిస్తూ ఉండవలసిందే. మనం అందరికి సహాయపడలేకపోవచ్చు. కాని అందరూ బాగుపడాలి అనే మనస్తత్వం మనకు ఉండాలి. దానివలన ఆధ్యాత్మికబలం పెరుగుతుంది. ఒక్కొక్క భావం ఉదయిస్తూ ఉంటే దానిని అక్కడికక్కడే విచారణద్వారా ధ్వంసం చేయాలి. మీకు ఏదైనా తలంపు వస్తూఉంటే అది ఎవరికి వస్తోంది ? ఎందుకు వస్తోంది? అని ఆతలంపును అది ఎక్కడ ఉదయిస్తోందో అక్కడే నాశనం చెయ్యి. ఇలా విచారణ చేయటం వలన దేహంనేను అనే మొదటితలంపు అంతర్ముఖమవుతుంది. అప్పడు దానికి వచ్చే ఇతర తలంపులు రాలిపోతాయి. వైరాగ్యం ఉన్నవాడి మనస్సు ఎప్పడూ ఆత్మను అంటిపెట్టుకొని ఉంటుంది. వైరాగ్యం లేనివాడి మనస్సు ఇంద్రియాలచుట్టూ, విషయాలచుట్టూ తిరుగుతూ ఉంటుంది. దీనినిబట్టి మీకు వైరాగ్యం ఉందో, లేదో మిమ్మల్నే అనుభవపూర్వకంగా చూసుకోమంటున్నారు. తాత్కాలిక సంఘటనల వలన వచ్చే వైరాగ్యం నిలబడదు, ఎవరో చనిపోవటం వలన వచ్చే వైరాగ్యం నిలబడదు. సద్విక్కు శ్రవణంచేసి అర్థంచేసుకోవటం వలన, ఏది శాశ్వతం ఏది శాశ్వతంకాదు అని నిశ్చయించుకొనే వివేకంలోనుండి వైరాగ్యం రావాలి. ఇటువంటి వైరాగ్యం ఉన్నవాడికి మాత్రమే ఆత్మముత్యం అనుభవంలోనికి వస్తుంది. నీలో

ఒక్కవాసనకూడా లేకుండా నిర్మూలించినప్పడు నువ్వు ఒడ్డుకు వస్తావు. కనీసం ఒక్క వాసన ఉన్నా అది పునర్జన్మకు కారణం అవుతుంది. మన జీవితంలో ఎన్నో హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి. కాని లోపలఉన్న ఈశ్వరుడిని మర్చిపోకూడదు. అలా జీవిస్తూ ఉంటే మనం ఈశ్వరుడిలో ఐక్యమవుతాము. జ్ఞానం కోసం కర్మను విడిచిపెట్టేస్తే రోజులు గడవవు. కర్మఫలాన్ని సన్యసించు అంతేగాని కర్మను విడిచిపెట్టవద్దు. నీ పని నీవు చేసుకొని కొంతకాలం ఏకాంతంగా ఉండు. అప్పడు నీ బలహీనతలు తెలుస్తాయి. ఆ బలహీనతలను ముందు అంగీకరించండి తరువాత వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తావు. ఒకవేళ నీచుట్టూ ఉన్నవారికి సహృదయం లేకపోయినా నీశాంతిని కాపాడుకో అదికూడా సాధనే. బట్టలు మార్చుకోవటం సన్యాసం కాదు, దొంగనేనును విడిచిపెట్టటం సన్యాసం అంటున్నారు భగవాన్. స్త్రీదేహంలో ఉన్న, పురుషదేహంలోఉన్నా అందరికీ జీవలక్షణాలు ఉంటాయి. నీవు ఏదేహంలో ఉన్నా, నీదేహం ఎక్కడ ఉన్నా దేహమునేను అనే బుద్ధిని త్యాగం చేయాలి. అదే నిజమైనసన్యాసం. పూజ చేసుకొంటే చేసుకోండి మంచిదే అయితే పూజగదికే పరిమితం అవ్వవద్దు. దైనందిన జీవితంలో మీ ప్రవర్తన ఎలా ఉంది ? సంఘటనలపట్ల, ఇతరులపట్ల మీ ప్రవర్తన ఎలా ఉంది అది చూసుకొంటూ మీ బుద్ధిని ఎప్పడూ సమానంగా ఉంచుకోవటానికి ప్రయత్నం చేస్తూఉంటే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది గాని ఎంతసేపు తలుపులు వేసుకొని నాలుగు గోడలమధ్యన కూర్చొంటే మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మీరు ఏ పనిచేసినా అది భగవంతుడి పని అనుకొని చేయాలి.

ఈ మధ్య ఒక మామగారు చెపుతున్నారు. నన్ను ఇంట్లో ఎవరూ పట్టించుకోవటం లేదు. ఏదో టైముకు భోజనం పెడుతున్నారు కాని ఆప్యాయత లేదు. వారు పట్టించుకోకపోవటమే మంచిది అని నాకు అనిపిస్తోంది. ఎందుచేతనంటే వారు పట్టించుకొంటే నా మనస్సు భగవంతునిమీదకు వెళ్ళదు, వారి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఇది నేను బెంగగా చెప్పటం లేదు, ఇదంతా భగవంతుడే చేస్తున్నాడని అనుకొంటున్నాను. వారిమధ్యనుండి పారిపోవాలని నాకు లేదు. వారిమధ్యలోనే ఉండి, వారితో సంబంధం లేకుండా శాంతిని పొందాలని ఉంది. వారి మాటలే భరించలేనప్పడు నాకు మోక్షం ఎలా వస్తుంది. ఇటువంటి చిన్న కష్టాలే భరించలేనప్పడు నా మనస్సుకు బలం లేదని భగవంతుడికి తెలుస్తూ ఉంటుంది కదా. మనోబలం లేనివాడికి మోక్షం ఎలా ఇస్తాడు అని మామగారు చెపుతున్నారు. నీకు సాధనా బలం పెరుగుతోంది అనుకో, నీ మనస్సుకు వికాశం కలుగుతోంది అనుకో, నీ హృదయంయొక్క లోతులు పెరుగుతున్నాయి అనుకో మంచిసంఘటనలు జరిగినా, చెడుసంఘటనలు జరిగినా నీ మనస్సుకు చాపల్యం రాదు. మంచీ, చెడూ కూడా ఈశ్వర సంకల్పమే అనుకొంటావు. ధ్యానబలం పెరిగినప్పడు, బుద్ధి సూక్ష్మత కలిగినప్పడు ఏ సంఘటనల ప్రభావం మీమీద ఉండదు.

# చదువవలెను, చదువవలెను, చావు లేని చదువు చదువవలెను

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-01-2001, ఏలూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హిందూమతం అంటే అది ఒక సనాతన ధర్మం. ఎలా జీవిస్తే మనం పునర్జన్మ లేనిస్థితికి చేరుకొంటాము అని చెప్పేది ధర్మం, ధర్మాన్ని ఇష్టంగా ఆచరించాలి. ధర్మాన్ని ఆచరించగా, ఆచరించగా మనస్సు అణుగుతుంది. పరమాత్మ అంతటా ఉన్నాడు. భారతీయ సాంప్రదాయంలో విగ్రహారాధన ఉంది. విగ్రహాన్ని ఆరాధించటం వలన మనోనిగ్రహం వస్తుంది. విగ్రహాన్ని ఆరాధించటంద్వారా అంతటా వ్యాపించి ఉన్న చైతన్యశక్తిని ఆరాధిస్తున్నాము. ఉపాసన లేకుండా శాంతిరాదు, మోక్షం రాదు. భగవంతుడు అంతటా ఉన్నమాట నిజమైనప్పటికి మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ఒక విగ్రహాన్ని ఆరాధించి, ఆ నామాన్ని స్మరించి భగవంతుడిలో ఐక్యం అవ్వాలి. భౌతికంగా రెండు దేహాలను కలపటానికి మనం కళ్యాణాలు చేస్తున్నాము. అలాగే జీవుడిని పరమేశ్వరుడిలో ఐక్యంచేయటానికి మనం ప్రయత్నం చేయాలి, ఇది ఆధ్యాత్మిక కళ్యాణం. బంధువులు బట్టలు పెడతారు, వస్తువులు ఇస్తారు కాని గురువు మనకు శాంతిని ఇస్తాడు, జ్ఞానాన్ని ఇస్తాడు, మన హృదయంలో ఉన్న సత్యాన్ని అనుభవైకవేద్యం చేస్తాడు. ఆధ్యాత్మిక కళ్యాణం అయ్యేవరకు మనలను ద్వైతబుద్ధి విడిచిపెట్టదు. మనకు ద్వైతబుద్ధి ఉన్నంతవరకు దుఃఖం, అశాంతి వెంటాడుతూ ఉంటాయి. మనకు ఎప్పుడు ఆనందం కలుగుతుంది అంటే పరమాత్మలో ఐక్యం అయినప్పుడు మనకు ఆనందం, శాంతి కలుగుతుంది. భగవంతునియొక్క ఒక నామాన్ని తీసుకొని జపించగా, జపించగా మనస్సు ఆ నామాన్ని పట్టుకొని ఉంటుంది. అప్పుడు మనస్సుయొక్క చాపల్యం తగ్గుతుంది. ఇప్పుడు మనందరి మనస్సు చిక్కగా ఉంది. భగవంతుని నామాన్ని స్మరించటం వలన మనస్సు పల్చబడుతుంది. జపయజ్ఞం వలన మనస్సులో ఉన్న దుమ్ముఅంతా రాలిపోతుంది. జపం యాంత్రికంగా కాకుండా ఇష్టంతో, ప్రేమతో చేయాలి. ప్రతీ శరీరం ఏదో పనిచేస్తూ ఉంటుంది, చనిపోవటం అనే పని చివరగా చేస్తుంది అదికూడా పనే. దేహం స్మశానానికి వెళ్ళేవరకు దానికి జరగవలసిన అనుభవాలు జరుగుతూ ఉంటాయి, దేహం ప్రారబ్దాన్నిబట్టి నడుస్తూ ఉంటుంది.జపం ఎవరైతే ఇష్టంగా, ప్రేమగా చేస్తున్నారో వారి ప్రారబ్దంలో వచ్చే సంఘటనలయొక్క వేగం, వాటి తాకిడి మనస్సును తాకకుండా జపఫలం అడ్డుకొంటుంది.

భగవంతుడిని మనం ఏదో ఒకటి కోరుతూ ఉంటాము. ఆయన అనుగ్రహమే చాలు అనుకొంటే సరిపోతుంది కాని మనం అలా అనుకోము ఏదో ఒకటి కోరుతూ ఉంటాము,

ఆయన ఇస్తాడు. చివరకు మన కోరికలే మనకు దుఃఖాన్ని తీసుకొని వస్తున్నాయి అని తెలియక భగవంతుని కోరికలు కోరుతూ ఉంటాము. ఈశ్వరుడిని కోరుకోవలసింది ఒక్కటే అదే మోక్షం మిగతాది అంతా దుమ్ము. కాని మనం మోక్షాన్ని కోరుకోవటం లేదు ఎందుచేతనంటే దాని విలువ మనకు తెలియటం లేదు. మన ప్రవర్తన బాగుంటే సరిపోదు దాని వలననే మోక్షంరాదు, భక్తికూడా అవసరం. భక్తివలన ముక్తి కలుగుతుంది. మీకు ఇష్టంలేని సంఘటన జరిగితే దుఃఖం వస్తుంది. దుఃఖం ఒక తలంపు, సుఖం ఒక తలంపు. తలంపు లేకపోతే సుఖం లేదు, దుఃఖం లేదు. నేను అనే తలంపు సుఖాన్ని తీసుకొని వచ్చే తలంపుతో కలిసినప్పడు నేను సుఖంగా ఉన్నాను అనుకొంటావు, దుఃఖాన్ని తీసుకొని వచ్చే తలంపుతో కలిసినప్పడు నేను దుఃఖపడుతున్నాను, నా పరిస్థితి బాగాలేదు అంటావు. పరిస్థితులు బాగాఉన్నా, బాగాలేకపోయినా ఇవిఅన్నీ దేహగతమైననేనుకే. నీ లోపల ఉన్న నిజానికి వీటితో ఏవిధమైన సంబంధం లేదు. మనకు భగవదనుభవం ఎందుకు కలగటం లేదు అంటే మనకు తెలియకుండా మనలో గర్వం ఉంది. చదువుకొన్నవారికి మేము బాగా చదువుకొన్నాము అని గర్వం, డబ్బు సంపాదించిన వారికి మాకు డబ్బు ఉంది అని గర్వం. ఇవి అన్నీ మిథ్యా నేనుకే. చదువవలెను, చదువవలెను చావులేనిచదువు చదువవలెను అన్నాడు ప్రహ్లాదుడు. ఆత్మస్థితి పొందాలనుకొనే సాధకులు అవినయం రాకుండా చూసుకోవాలి. ఏమీ దోషంలేనివాడు పరమాత్మ. మనలో దోషాలు ఉంటే లోపాలు ఉంటే వాటిని తొలగించుకోవటం మానేసి మాలో ఏమీ లోపాలులేవు, దోషాలు లేవు అనుకొంటే ప్రయోజనం ఏమిటి? మీలో ఉన్న లోపాలు, దోషాలు ఏమిటో తెలుసుకొని ప్రయత్నంచేసి వాటిని తొలగిస్తే అప్పడు మీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. జపం చేయగా చేయగా ధ్యానం దానిఅంతట అదే వస్తుంది. ధ్యానం చేసేది కాదు వచ్చేది. ఏక వస్తువును నిరంతరం చింతించగా, చింతించగా మనలోఉన్న పునర్జన్మ హేతువులు సమూలంగా నశిస్తాయి. ధ్యానం చేయగా చేయగా నీకు లోచూపు కలుగుతుంది. లోచూపు లేకుండా లోపలఉన్న వస్తువు నీకు వ్యక్తం కాదు.

ప్రాణాయామం మనోనిగ్రహానికి సహకరిస్తుంది. స్వాధీనమయిన మనస్సు మనలను సుఖపెడుతుంది, స్వాధీనంలోలేని మనస్సు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఒకే సంఘటన ఇద్దరు వ్యక్తులకు జరిగింది అనుకోండి. ఒకరు నిర్మలంగా ఉండవచ్చు, ఒకరు దానికే దుః ఖపడవచ్చు. అది వారి మానసిక పరిస్థితినిబట్టి ఉంటుంది. మనం ఏ పనిచేసినా ఆడంబరం లేకుండా చేయాలి. మనం ఇతరులకు ఏదైనా సహాయ సహకారములుచేస్తే ఏదో టైములో, ఏదో జన్మలో అది తిరిగి మనకే వస్తుంది అని మనకు అర్థమయితే ఇతరులకు సహాయం

చేస్తూనే ఉంటాము. మనకు వచ్చే తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనకు వచ్చే తలంపులను ఆచరణలో పెట్టకూడదు. ఆచరణలో పెడితే వాసన అయిపోతుంది. ఆ వాసన పునర్జన్మకు కారణం అవుతుంది. భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు అని చెపుతున్నారు కదా మరి ఉంటే నాకు కనబడాలి కదా అని ప్రశ్న. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే నీ అలవాట్లయొక్క వేగం వలన, నీ తలంపులయొక్క వేగం వలన ఆయన నీకు తెలియటం లేదు, వాటి వేగం అణిగిపోతే ఆయన నీకు తెలుస్తాడు. ఉండటం అందరి హృదయాలలో ఉన్నాడు అది తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. ఆయనను తెలుసుకోవటానికే ఈ జ్ఞానయాజ్ఞాలయొక్క ప్రయోజనం. రాత్రి పడుకొనేముందు కొద్దిసేపు జపంచెయ్యి, ధ్యానంచెయ్యి. అప్పుడు రాత్రి నీకు తెలియకుండా జపం జరుగుతుంది. జపం, ధ్యానం చేయటం నీకు కుదరకపోతే మంచిగ్రంధాలను, మహాత్ములు చెప్పిన మాటలను అధ్యయనం చెయ్యి. వాటి అధ్యయనం వలన నీ మనస్సు నిర్మలం అవుతుంది, దాని ప్రభావం రాత్రి అంతా పనిచేస్తుంది.

మన మనస్సుకు భోగచింతన ఎక్కువగా ఉంది. ఎంతసేపు బాహ్యవిషయాలను ఎంజాయ్ చేయాలనే భోగబుద్ధి ఉంది కాని మనకు యోగబుద్ధి లేదు. భోగబుద్ధిలోనుండి విడుదల చేసి మనకు యోగబుద్ధిని కలుగజేయటానికే వ్రతాలు, తీర్థయాత్రలు అవి మన పెద్దలు పెట్టారు. భోగంలో ఉన్న నిస్సారతను మన బుద్ధికి తెలియజెప్పి, మన బుద్ధిని దానినుండి మళ్ళింపజేసి దానికి యోగబుద్ధిని కలుగజేయటానికే వ్రతాలు పెట్టారు. మీ మనస్సు చిన్న విషయాలకు రియాక్టు అవ్వకపోతే అదికూడా సాధనలో ఒక భాగము. ఎవడు యోగి అవుతాడు అంటే వాడికి యాక్షన్ ఉంటుంది గాని రియాక్షన్ ఉండదు వాడు యోగి అవుతాడు. భోగికి భగవదనుభవం రాదు, యోగికి భగవదనుభవం కలుగుతుంది. మీకు ఎవరైనా ఉపకారం చేసారు అనుకోండి. వెంటనే వారిమీద మీకు రాగం వచ్చేస్తుంది. అది ఒక ప్రమాదం. వాడు ఏమనుకొంటాడు అంటే మీకు ఉపకారం చేస్తాడు కదా, మీరు అణిగి ఉండాలి అని అనుకొంటాడు. వాడు, మీరు కూడా చివరకు బంధంలో పడుతున్నారు. చేసింది మర్చిపోవాలి. ఏదైనా ఇచ్చిపుచ్చుకోవటం ఎలా ఉండాలంటే నిర్మలంగా, శాంతిగా, సహజంగా ఉండాలి. లోపలఉన్న వస్తువు సహజంగా ఉంది, నిర్మలంగా ఉంది. దైనందిన జీవితంలో మన ప్రవర్తనకూడా నిర్మలంగా, సహజంగా ఉండేటట్లు తీర్చిదిద్దుకుంటే ఆ వస్తువు మనకు అందుతుంది. ఆత్మ ఇట్టిది, అట్టిది అని అనుకోవటం జ్ఞానంకాదు, ఆత్మగా ఉండటం జ్ఞానం. మనస్సు అణగకపోతే, మనస్సు స్వాధీనంలోనికి రాకపోతే ఎక్కడున్నా అశాంతే. నియమింపబడిన

మనస్సు నీకు శాంతిని తీసుకొని వస్తుంది అప్పుడు నీ చేతిలో ఉన్న పనిని సమగ్రంగా చేయగలవు. నీ మనస్సును నీవే బాగుచేసుకోవాలి, ఎవరోవచ్చి బాగుచేస్తారని చూడకు. గురువు నీకు సహకరిస్తాడు. భగవంతుని స్మరించుకొంటూ, భగవంతునికి ఇష్టమైన పనులుచేస్తూ ఆయన అనుగ్రహాన్ని సంపాదించి నీ మనస్సును స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చెయ్యి. నీ మనస్సుసు ఉద్ధరించుకొంటే ఇరుకు మనస్సులోనుండి బయటకు వచ్చేస్తావు. అప్పుడు నీకు మహామనస్సు, విశాలమైన మనస్సు కలుగుతుంది. అప్పుడు ఈ లోకాన్ని అంతా కౌగిలించుకోవాలని నీకు అనిపిస్తుంది. యోగులను ఆశ్రయించి, మహాత్ములను ఆశ్రయించి నీకు తెలియని విషయాలు తెలుసుకోవాలి. వారికి అన్నీ సాధ్యమే. వారు చెప్పటమే కాదు జ్ఞానాన్ని ఇవ్వగలరు.జపం చేయగా చేయగా అది నీ ప్రాణంతోటి, నీ మనస్సుతోటి ఐక్యమయిపోయి నీకు సహజంగా అది జరిగిపోతూ ఉంటుంది. అప్పుడు ధ్యానస్థితి కలుగుతుంది. ధ్యానస్థితి నీకు నిజాన్ని పట్టిఇస్తుంది. వాసన మనస్సును బాహ్యముఖం చేస్తుంది. జపం చేయటం వలన వాసనయొక్క వేగం తగ్గుతుంది. అయితే ఆ దేవుడు ఎక్కువ, ఈ దేవుడు ఎక్కువ అని చెపుతూ ఉంటారు ఆ అడవిలో పడకండి. ఉన్నవాడు ఒక్కడే. శివపురాణంలో శివుడియొక్క ఔన్నత్యం, విష్ణుపురాణంలో విష్ణువుయొక్క ఔన్నత్యం చెపుతారు ఎందుచేతనంటే నీ మనస్సు అక్కడ నిలబడాలి. అక్కడ ఏదో గొప్పతనం ఉంది అని అనుకొంటే తప్ప నీ మనస్సు అక్కడ నిలబడదు. ఆత్మ లేకుండా దేవుడు ఉండలేడు, దేవుడు లేకుండా ఆత్మ ఉండగలదు. గాఢనిద్రలో శివభక్తులు శివుడినుండి, విష్ణుభక్తులు విష్ణువునుండి వేరుపడిపోతున్నారు. అప్పుడు నీవు లేవా అంటే ఉన్నావు ఆ స్థితిని నీవు పట్టుకోవాలి. ఆ స్థితిని పట్టుకోవటానికి శివుడినో, విష్ణువునో ఉపాసన చేయాలి. నామ, రూప జగత్తును దాటినవాడికి ఉపాసనతో పనిలేదు. మనం ఏదో ఒక రూపంతో తాదాప్యం పొందుతున్నాము కాబట్టి అందులోనుండి బయటకు రావటానికి ఉపాసన అవసరం. మీకు విష్ణువు అంటే ఇష్టం అనుకోండి, మీ మనస్సు అక్కడ నిలబడుతోంది అనుకోండి విష్ణువును ఉపాసన చేసుకోండి. ఎవడో శివుడిని చేస్తున్నాడని మీరు చేయనక్కరలేదు. అక్కడ ఉన్నవాడు ఇక్కడ ఉన్నవాడు ఒక్కటే. నిజం అనేది ఎప్పుడూ ఒక్కటిగానే ఉంటుంది. వాడికంటే వీడు గొప్పవాడు అని చెప్పటానికి ఇద్దరు లేరు ఉన్నవాడు ఒక్కడే. ఆహార నియమం లేనివాడికి ఎంత సాధన చేసినా అధ్యాత్మిక పురోగతి ఉండదు. ఆహారం విషయంలో, మాటల విషయంలో, స్నేహాల విషయంలో, నిద్ర విషయంలో తగుమాత్రంగా ఉండాలి, అతి పనికిరాదు.

## నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి అభ్యాసం చెయ్యాలి దీనికి మధ్యవర్తులు అక్కర లేదు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-01-2001, మల్కిపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహబుద్ధి నశించాక, ప్రకృతిగుణాలు దాటిన తరువాత, స్వరూపజ్ఞానం కలిగాక ఎవరైనా ఒక్కటే. జన్మతరువాత జన్మ, జన్మతరువాతజన్మలేని దానికోసం ఇలా ఎన్నిజన్మలు వెతుకుతారు. మనందరము లేనిదానికోసం వెతుకుచున్నాము. ఉన్నదానికోసం వెతికితే ఈ జన్మలో కాకపోయినా పదిజన్మల తరువాత అయినా అది దొరుకుతుంది. మన హృదయంలో ఉన్న బ్రహ్మం గురించి వెతకటం మానివేసాము, లేని ప్రకృతి కోసం వెతుకుచున్నాము, స్వప్న మాత్రమైన ఈ లోకంలో ఏదో ఉంది అని వెతుకుచున్నాము. దేవాలయంలో ఉన్న దేవుడికి రూపం ఉంది. హృదయంలో ఉన్న దేవుడికి రూపంలేదు. మనకు దేవాలయం అంటే ఇష్టం, హృదయంలో ఉన్న ఆలయం అంటే ఇష్టం లేదు. దేవాలయంలో ఉన్న దేవుడు ఇంద్రియాలకు కనబడతాడు అందువలన మనకు ఇష్టం. హృదయంలో ఉన్న దేవుడు ఇంద్రియాలకు కనబడడు. మహాత్ములను ఆశ్రయించి, యోగులను ఆశ్రయించి వారికి సేవచేసి వారి అనుగ్రహానికి పాత్రులయితే జ్ఞాననేత్రం వస్తుంది, ఆ జ్ఞాననేత్రంతో హృదయంలో ఉన్న దేవుడిని చూడవచ్చు. అక్కడ ఉన్నది మహా వెలుగు, శాంతి, ఆనందం. దానిని తెలుసుకోవాలనే తపన, సంకల్పం పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసుకొన్నవారికి గాని కలుగదు. అంతర్దృష్టి కలిగినవాడికి, కామక్రోధములనుండి విడుదలపొందినవాడికి శాస్త్రాలతో పనిలేదు. కోపాన్ని జయించినవాడు లోకాన్ని జయిస్తాడు. అగ్నిలో పిడకలు కాలిపోతాయి, పుల్లలు కాలిపోతాయి, బంగారం కాలిపోతుంది అన్నీ కాలిపోతాయి. అలాగే జ్ఞానాగ్ని ఉదయిస్తే మీలో ఉన్న రాగద్వేషములు, పుణ్యపాపములు, ద్వైతబుద్ధి అంతాకాలిపోతుంది. సంస్కర్తలు కావలెను, వాడిని వాడు సంస్కరించుకొనే సంస్కర్తలు కావలెను. తాను సంస్కరింపబడకుండా లోకం సంస్కరింపబడదు. మనం మారకుండా లోకాన్ని మార్చాలనటం వెర్రితనం. నాలో శాంతి లేకపోతే మీకు శాంతి ఎలా ఇవ్వగలను. నాలో ఏదైనా ఉంటే అది మీకు ఇవ్వగలను.

దయ, దానం, ధమం విడిచిపెట్టకండి. ఇతరులను ఉద్ధరించటం కోసం కాదు, మీరు పవిత్రులు అవ్వటం కోసం ఈ మూడు విడిచిపెట్టవద్దు. దయగల హృదయమే భగవంతుని

నిలయం. దయ కలిగి ఉండటానికి, డబ్బుకు సంబంధంలేదు. మీకు శక్తిఉంటే దానం. ధమం అంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వీటిని విడచిపెట్టవద్దు. వీటిని ఆచరించటం వలన మీరు సంస్కరింపబడతారు, మీ చైతన్యస్థాయి పెరుగుతుంది, మనస్సులో మాలిన్యం ఉంటే కొట్టుకొనిపోతుంది అని భారతంలో చెప్పాడు. పూర్వ పుణ్యం లేకపోతే ఆత్మవిద్యను శ్రవణం చేయాలనే బుద్ధి కలుగదు. ఎవరైతే నా మాటలను పరస్పరం బోధించుకొంటున్నారో, ఎవరైతే నా మాటలలోని శాంతిని, ఆనందమును అనుభవిస్తున్నారో వారికి హృదయంలో ఉన్న దేవుడిని చూడటానికి తగిన సూక్ష్మబుద్ధిని నా చేతులతో నేను ప్రసాదిస్తాను అని భగవంతుడు చెప్పాడు. కామక్రోధములనుండి విడుదల పొందలేకపోతే ఎన్ని గ్రంధాలు చదివినా, ఎంత ధనం సంపాదించినా అవి అన్నీ స్వప్న సమానము. ధనానికి రాజు అయితే భోగం వస్తుంది, జ్ఞానానికి రాజు అయితే మోక్షం వస్తుంది. ఎంతకాలం అయితే మనలో భోగవాంఛ ఉందో అంతకాలం జన్మలు వస్తూనే ఉంటాయి. మనం నేను, నాది అనే తలంపులయొక్క ఉచ్చులో పడిఉన్నాము. ఇంక మనకు జ్ఞానం ఎలా కలుగుతుంది. చూపులో వెలుగు కావాలంటే, మాట సౌమ్యంగా ఉండాలంటే నువ్వు నిరాడంబరంగా జీవిస్తే కదా ఆ వైభవం నీకు కలిగేది. జీవించటం నిరాడంబరంగా జీవించాలి, ఆలోచన ఉదాత్తంగా, ఉన్నతంగా ఉండాలి అని పెద్దలు చెపుతారు. నిరాడంబరంగా జీవిస్తే నీ చూపులో వెలుతురు వస్తుంది, నీ మాటకు సౌందర్యం, సౌమ్యత వస్తుంది, నీకు లోచూపు కలుగుతుంది. మహర్షులను గౌరవించటం వలన, సేవించటం వలన సమాధి స్థితి కలుగుతుంది. నీవు ఎవరిగా ఉన్నావో నీకు సమాధిస్థితిలో తెలుస్తుంది. సమాధి స్థితి ఎవరికి కలుగుతుంది అంటే నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా జీవించేవారికి కలుగుతుంది. ఉదాసీనంగా బ్రతకటం నేర్చుకొంటే ఏదో ఒకరోజు ఈ దేహం నీవుకాదని నీకు తెలుస్తుంది. ఆసక్తి లేకుండా జీవిస్తే మనస్సుకు మాలిన్యం అంటదు. దేనిపట్ల ఆసక్తి ఉన్నా మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. అందువలన ఆసక్తి పనికిరాదు. కర్మఫల త్యాగి సన్యాసి అని భగవంతుడు చెప్పాడు. కర్మఫల త్యాగం వలన నీవు పరిశుద్ధుడవు అవుతావు.

గురువు మీచేత శ్రవణం చేయించటమేకాదు మీరు విన్న మాట మీకు అనుభవంలోనికి వచ్చేవరకు గురువు అనుగ్రహం మిమ్మల్ని వెంటాడుతూ ఉంటుంది. చాలామంది దేవునియొక్క అనుగ్రహం మామీద లేదు అని అంటారు. దేవుని అనుగ్రహం

లేదని అనుకోవటానికి కూడా దేవుని అనుగ్రహమే కారణం అని మీరు గుర్తించలేకపోతున్నారు. ఎవరో ఏదో పొరపాటు చేసారని దానిని నీవు అనుకరించవద్దు. నీ జీవితాన్ని తీర్చిదిద్దుకొనే విధానం చూసుకొంటే నీవు తరిస్తావు. అజ్ఞానంలోనుండి విడుదల కాకపోతే మీది ఏకులం అయినా, ఏమతం అయినా, మీ ఇష్టదేవత ఎవరయినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. మనకు ఏ కారణం వలన దుఃఖంవచ్చినా అక్కడ అజ్ఞానం ఉన్నట్లు గుర్తు. దేహానికి రోగంవస్తే ఔషధం తిను, మనస్సుకు దుఃఖంవస్తే భగవంతుని గురించి శ్రవణం చెయ్యి అని పెద్దలు చెపుతారు. నాకు బ్రహ్మానుభవం కావాలి అని అంటారు. అందులో జీవిస్తేకదా దాని తాలూక అనుభవం నీకు కలిగేది. నీవు దేహంగా జీవిస్తూఉంటే, అజ్ఞానంగా జీవిస్తూఉంటే బ్రహ్మం గురించి నీకు ఎలా తెలుస్తుంది. బ్రహ్మంగా జీవించేవాడికి బ్రహ్మం గురించి తెలుస్తుంది, బ్రహ్మానుభవం కలుగుతుంది. దుఃఖం నశించటానికి రెండు మార్గములు ఉన్నాయి. 1. నీ ఇష్టమేనాఇష్టం అని మినహాయింపులు లేకుండా భగవంతునికి పూర్ణశరణాగతి చెందు అప్పుడు దుఃఖం నశిస్తుంది. 2. ఈ దుఃఖానికి కారణం ఏమిటి అని అన్వేషించి ఆ కారణాన్ని తొలగిస్తే దుఃఖం నశిస్తుంది. దేనినిచూసి నీవు గర్వపడకు. మరణాన్ని గుర్తుపెట్టుకో. ఏదోరోజు నీ దేహం మరణిస్తుంది అని గుర్తుపెట్టుకో అప్పుడు నీ జీవితాన్ని సరిదిద్దుకోవటానికి బాగుంటుంది అని బుద్ధుడు చెప్పాడు. నీ మనస్సు ఎప్పుడైతే మరణాన్ని గుర్తుపెట్టుకొందో దానంతట అదే సంస్కరింపబడుతుంది. మరణాన్ని జ్ఞాపకంపెట్టుకొంటే మరణంయొక్క స్మరణ నీచేత అన్ని సాధనలు చేయిస్తుంది. ఎంతటివాడికైనా ఏదోరోజు శరీరం కాలిబూడిద అవ్వవలసిందే. ప్రారబ్ధంలో ఉన్నది పోదు, లేనిది రాదు.

నీ హృదయంలో ఒకనిజం ఉంది. అభ్యాసం చేయగా చేయగా నీ హృదయంలో ఉన్న నిజం నీకు గోచరిస్తుంది. దీనికి నీకు మధ్యవర్తులు అక్కరలేదు. ఇతరులు నీ గురించి ఏమనుకొంటున్నారు అని ఆలోచించకు. ఇతరుల అహంకారం నీ గురించి ఏమనుకొంటే మటుకు ఏముంది? దేవుడు నీ గురించి ఏమనుకొంటున్నాడో ఆలోచించు. దేవుడు చెప్పినవిధంగా ఎంతవరకు జీవించగలుగుతున్నావో చూసుకో. ఎట్టిపరిస్థితులలోను నీవు పొంగిపోవద్దు, కృంగిపోవద్దు. మనస్సును సమానంగా ఉంచుకోవటానికి ప్రయత్నం చెయ్యి అప్పుడు నీ హృదయంలో ఉన్న ఆనందం పొంగివచ్చి నీ సహస్రారాన్ని ముంచుతుంది. హృదయంలో ఉన్న శాంతి, ఆనందం ఇదా, మోక్షం అంటే ఇదా అని అప్పుడు నీకు తెలుస్తుంది.

లేని వస్తువు కోసం జన్మ తరువాత జన్మ ఇలా కోటిజన్మలు వెతికినా దొరుకుతుందా? ఉన్న వస్తువు కోసం వెతకండి ఇప్పడు కాకపోయినా పదిజన్మల తరువాత అయినా దొరుకుతుంది. లేని వస్తువు కోసం ఇలా ఎన్నిజన్మలు వెతుకుతారు. మీరు అర్థం చేసుకొని, జీర్ణం చేసుకొంటే మీరు బాగుపడటానికి ఈ ఒక్క వాక్యం చాలు. నీవు ఇష్టంగాచేస్తే అది వ్రతం, అయిష్టంగాచేస్తే అది శిక్షతో సమానం.

నీవు ఎంతకాలం జీవించావు అనేది ప్రధానం కాదు, నీవు ఎలా జీవించావు అనేది ప్రధానం. నీకు సందేహ నివృత్తి అయ్యేవరకు గురువు అవసరం. శివలింగం అంటే రూపంలేని రూపం. అసలు వస్తువుకు రూపంలేదు. ఏదో ఒక రూపంతోటి, నామంతోటి తాదాప్యం పొందుతున్న మనలను నామ, రూప, గుణ రహితమైన స్థితికి తీసుకొని వెళ్లటానికి మధ్యవర్తిగా శివలింగం పనిచేస్తుంది. నెగ్గిన కోడిపుంజు ముందు ఓడిన పుంజు ఎలా పడిపోతుందో అలాగ. సాధనా బలం పెరుగుతూఉంటే నీ పునర్జన్మ హేతువులు అన్నీ తలవంచి, వాడిపోయి, రాలిపోతాయి. నీకు సాధనచేసే శక్తి లేకపోతే సత్పురుషులను ఆశ్రయించు. సత్పురుషుల సమక్షంలో నీ మనస్సుయొక్క చాపల్యం దాని అంతట అదే తగ్గిపోతుంది. అన్ని ఆభరణాలలోను బంగారం ఉంది. అలాగే అన్ని నామాలలో, రూపాలలో అంతర్యామిగా భగవంతుడు ఉన్నాడు. మీరు గొలుసును చూసేటప్పడు దానిలోఉన్న బంగారాన్ని చూడండి. అదేవిధంగా ఏ రూపాన్ని చూసినా, నామాన్ని చూసినా అంతర్యామిగా ఉన్న పరమాత్మను చూడటం నేర్చుకోండి. అంతర్యామిని చూసేవాడికి భయం ఏమిటి? ద్వేషం ఏమిటి? ఆకర్షణ ఏమిటి? ఏదీలేదు. కొంతమందికి 100 కోట్లు సంపాదించినా తృప్తి ఉండదు. మీరు సంపాదనపట్ల సంతృప్తి పడండి. పెళ్లి చేసుకొన్నాక భార్య విషయంలో సంతృప్తి పడండి. మీకు నచ్చిన భార్య రాకపోయినా, వచ్చిన భార్య నచ్చేటట్లు చేసుకోండి. ఆహారం తినటం విషయంలో సంతృప్తి పడండి. మీకు సంతృప్తి లేకపోతే దుఃఖం మిగులుతుంది అని చాణుక్యుడు చెప్పాడు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు తెలియకపోయినా ఫరవాలేదు దానిని తీసుకొనివచ్చి దేహంతోటి, ఇంద్రియాలతోటి, మనస్సుతోటి ఏకంచేసి ఇదే నిజం అనుకొంటున్నావు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమయ్యే వరకు ఏ జన్మకు ఆ జన్మ గందరగోళం, విషాదం, దుఃఖం నిన్ను వెంటాడుతూ ఉంటాయి.

మనకు ఉన్నది మిథ్యాజ్ఞానం. దానిని సత్యజ్ఞానం అని అనుకోవద్దు. మిథ్యానేను ఎంత

నిజమో ఈ మిధ్యాజ్ఞానంకూడా అంతే నిజం. మిధ్యాజ్ఞానం నీ పొట్టకు పనికి వస్తుంది కాని సత్యజ్ఞానం నీకు సత్యానుభవాన్ని పట్టి ఇస్తుంది. మీరు అన్నం తినకుండా ఉపవాసం చేస్తూఉంటే ఆరోజుకారోజు దేహం కృశించి రాలిపోతుంది. అలాగే మీరు విషయాలతో కాకుండా మహాజ్ఞానంతో, మహా వెలుతురుతో మానసిక అనుబంధం పెట్టుకొంటే నీ అజ్ఞానం కృశించి నీకు తెలియకుండానే రాలిపోతుంది. అప్పుడు నీహృదయంలోఉన్న వస్తువు నీకు వ్యక్తమవుతుంది.ఎప్పుడో వస్తుంది, ఎక్కడో వస్తుంది అనుకొన్నాను కాని ఇప్పడే, ఇక్కడే పొందాను అని నీకు అనిపిస్తుంది ఎప్పుడు నీలో ఉన్న అజ్ఞానం రాలిపోయినప్పుడు. ఉపవాసాలు చేసేటప్పుడు శారీరక బాధ, ఆకలి బాధ ప్రారంభమవుతుంది. అలాగే వాసన నశించేటప్పుడు అది నిన్ను పీడిస్తుంది. దానిని మీరు తట్టుకోగలిగితే ఆ వాసన వాడిపోయి రాలిపోతుంది. స్మరణ ముఖ్యం. మనస్సుతో స్మరిస్తాము. ఆ స్మరణే మనస్సును కాల్చి బూడిద చేస్తుంది. మహాత్ములతో మానసిక అనుబంధం పెట్టుకొంటే నీ లోపల ఉన్న నిజం నీకు గోచరిస్తుంది. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసిఉంటే మంచిదే. దానితో తాదాప్యం నీకు కుదరకపోతే హృదయంలో ఉన్న సత్యవస్తువుతో తాదాప్యం పొందినవారితో నీకు తాదాప్యం మంచిది. అప్పడు నీకు వివేకం పెరుగుతుంది, నీ మనస్సు చల్లబడుతుంది. కృష్ణుడు అవతరించనప్పడు ఉన్నాడు, అవతరించినప్పుడు ఉన్నాడు. శరీరం రానప్పుడు ఎలా ఉన్నాడో వాడితో నీకు తాదాప్యం కుదరకపోతే శరీరం వచ్చిన తరువాత ఎలాగ ఉన్నాడో వాడితో తాదాప్యం చెందు. కృష్ణుడు శరీరం ధరించనప్పుడు పట్టుకోలేకపోతే, కృష్ణుడు రూపం వచ్చిన తరువాత దానిని పట్టుకో. అది రూపం అనుకొంటున్నావేమో రూపం ధరించినప్పడు కూడా అది బ్రహ్మమే. నీకు నిజం తెలియకపోయినా నీవు ఆశ్రయించిన దేవుడికి నిజం తెలుసు అక్కడకు తోలుకొని వెళ్ళేవరకు నిన్ను విడిచిపెట్టడు. గాఢనిద్రలో మనం అలాగ ఉండము, ఇలాగ ఉండము, సహజంగా ఉంటాము. గాఢనిద్రలోఉన్న సహజస్థితిని జాగ్రదవస్థలోనికి తెచ్చుకొంటే దానిని సమాధి స్థితి అంటారు. ఎన్ని గ్రంథాలు చదివితే మటుకు ఏమిటి ప్రయోజనం? రాగద్వేషములనుండి విడుదలపొంది నీవు ఉదాసీనంగా జీవించినప్పడు కదా నీకు దేహబుద్ది నశించేది అంటారు భగవాన్. మీ ఇంటి దగ్గర వస్తువులను ఒకవేళ అనుభవిస్తే నాది అని అనుభవించకు, ఈ సొత్తు అంతా భగవంతుడిదే అని అనుభవించు. జ్ఞానం రాకముందు అంతా నాది, నాది

అనుకొంటావు. జ్ఞానం కలిగాక అంతా ఆయనదే అని నీకు తెలుస్తుంది.

## సత్పురుషుల సన్నిధిలో నీవు పొందవలసింది ప్రయత్నం లేకుండా పొందుతావు

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-11-2000, మురమళ్ళ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సత్సంగమువలన ప్రాపంచిక విషయములతో సంబంధం తొలగుతుంది. అంటే భక్తులతోటి, యోగులతోటి, జ్ఞానులతోటి సహవాసం చేయటంవలన వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేస్తాయి. కొంతమంది కర్మను యోగంగా చేస్తారు. అటువంటివారితో సహవాసం వలన మనలో ఉన్న స్వార్థం పల్చబడుతుంది. మీ ప్రారబ్దంలో ఏది ఉంటే అది మీ సంకల్పంతో సంబంధం లేకుండా జరిగిపోతుంది. అది ఈశ్వరాజ్ఞ. ఆయన ఆజ్ఞ లేకపోతే గడ్డిపరకను కూడా కదపలేము. మనతోటి ఈ ప్రపంచం ముగిసిపోతుంది అనుకోకండి. మనం చనిపోయిన తరువాత కూడా ఇది ఉంటుంది. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు ఆయన ఆజ్ఞననుసరించి ఈ జీవకోటి అంతా నడుస్తూ ఉంటుంది. మన వ్యక్తి భావననుబట్టి మనం ఏదో స్వతంత్రులం అనుకొంటాము. మన కళ్ళకు కనబడని శక్తి ఒకటి ఉంది. అదే ఈ జీవకోటిని నడిపిస్తోంది. మన కళ్ళతో చూసే వస్తువులే మనం నిజం అనుకొంటున్నాము. ఆ శక్తి మన కళ్ళకు కనబడటం లేదు కాబట్టి అది నిజంకాదు అనుకొంటున్నాము. అందుచేత ఈ తిప్పలు, కష్టాలు, నష్టాలు ఆందోళనలు అన్నీ వస్తున్నాయి. మనకళ్ళకు కనబడే వస్తువులుమీద ఉన్న విశ్వాసం వాటికి ఆధారంగా ఉన్న చైతన్యంమీద మనకు లేదు. సబ్జక్టును బాగా అర్థం చేసుకోండి. చైతన్యం ఒక్కటే నిజం మిగిలినవన్నీ నీ మనస్సుయొక్క కల్పితములే. ఏ విషయాలు నిన్ను ఈ దేహానికి, లోకానికి బంధిస్తున్నాయో, ఏ విషయాలు నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తున్నాయో సత్పురుషుల సహవాసం ఆ విషయచింతనను పోగొట్టి విషయాలకు అతీతంగా నిర్విషయంగా, నిర్మలంగా, నిశ్చలంగా బ్రతికే పరిస్థితులు తీసుకొనివస్తుంది. సత్పురుషుల సహవాసం వలన దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన తగ్గిపోతాయి. ఎవరికైతే ఆత్మజ్ఞానం ఉందో, ఎవరికైతే ఆత్మలబ్ధి కలిగిందో వారితో సహవాసం చేయటం వలన అన్నీ సమకూడతాయి, మోక్షం కూడా వస్తుంది, వారిద్వారా వచ్చే లాభం మన కళ్ళకు కనబడదు.

ఇవాళ పచ్చగా ఉండి, రేపు ఎండిపోయే భౌతికమైన వస్తువులను సంపాదించటానికే ఎంతో క్రమశిక్షణ, ఏకాగ్రత అవసరమవుతోంది మరి భగవదనుభవం పొందటానికి ఎంత

క్రమశిక్షణ, మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం అవసరమో మీరే ఆలోచించుకోండి. మనం ధర్మాన్ని ఆచరించాలి. ఎన్ని పూజలు, వ్రతాలు చేసినా ధర్మాన్ని ఆచరించని మనిషికి నిజమైన భక్తి కలుగనే కలుగదు. ధర్మాన్ని ఆచరిస్తే భగవదనుభవం పొందటానికి తగిన భక్తి కలుగుతుంది. భక్తివలన ముక్తి కలుగుతుంది. ప్రపంచంలో అన్నింటికంటే ఉదాత్తమైన స్థితి ఉత్తమమైన స్థితి ఏమిటంటే అది మోక్షమే. ధర్మాన్ని ఆచరించకుండా ఒక ప్రక్కకుపెట్టి, మన డ్యూటీ మనం చేయకుండా అభిషేకాలు చేద్దాం, నదులలో స్నానంచేద్దాం ఏదో వస్తుంది అంటే మన చేష్టలను చూసి మోసపోయేటంత అమాయకుడు కాదు భగవంతుడు. పనిచెయ్యి కర్తలేని కర్మచెయ్యి, యోగంలో ఉండి పనిచెయ్యి, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చెయ్యి. నేను చేస్తున్నాను అనే తలంపుతో చేస్తే మనిషికూడా నీడ ఎలా వస్తుందో నీకూడా కర్మానుభవం పరిగెడుతూ ఉంటుంది. కర్మానుభవం పూర్తిఅయితేనేగాని నీకు జ్ఞానం కలుగదు. కర్తలేనికర్మచేస్తే నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. చేతిలో డబ్బుఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంత తేలికో చిత్తశుద్ధి ఉన్నవాడికి మోక్షం రావటం అంత తేలిక. ఎన్ని గ్రంధాలు చదివినా, ఎంత సత్కర్మ చేసినా జ్ఞాని సమక్షంలో పొందే శాంతికి అవి సరికాదు. జ్ఞాని సమక్షంలో ఉన్నప్పడు జ్ఞానం పొందాలనే కాంక్ష నీకు కలుగుతుంది. సత్పురుషుల సహవాసం నీకు దొరికితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతావు. అంటే పెద్దపెద్ద నియమాలతో సంబంధం లేకుండా లోపల ఉన్న సద్వస్తువు నీకు స్ఫురిస్తూ ఉంటుంది. నదికి వరద వచ్చినప్పడు పెద్దపెద్ద దుంగలుకూడా ఆ ప్రవాహంలో వేగంగా కొట్టుకొనిపోతాయి. అలాగే జ్ఞాని సమక్షంలో ఉన్నప్పడు ఆ చైతన్య ప్రవాహంలో ఆత్మానుభవం పొందటానికి అడ్డువచ్చే నీ అలవాట్లు అనే దుంగలు కొట్టుకొనిపోతాయి. సత్పురుషులయొక్క సన్నిధి సహజమైన గాలి వంటిది. నీ మనస్సుతో నీవు చేసే ప్రయత్నం విసనకర్రతో వచ్చే గాలి వంటిది. సత్పురుషుల సన్నిధిలో నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా నీవు పొందవలసినది పొందుతావు. జ్ఞాని సమక్షంలో ఉన్నప్పడు అక్కడనుండి వచ్చే శాంతి తరంగాలు కాంతి తరంగాలు నీ మనస్సును పరిశుద్ధం చేస్తాయి, పవిత్రం చేస్తాయి. ఒకసారి చలంగారు భగవాన్ గురించి చెపుతూ ఆయన ఎవరో నాకు అక్కరలేదు, ఆయన ఏమిటో నాకు అక్కరలేదు. ఆయన నాకు ఆనంద సముద్రం, శాంతి సముద్రం. ఆయన దగ్గరనుండి శాంతి, కాంతి ప్రసరిస్తోంది. ఆయన దగ్గరనుండి నేను ఏది పొందుతున్నానో అది నాకు ముఖ్యంగాని మిగతా విషయాలు అన్నీ అప్రధానం అని చెప్పారు.

రాగము, భయము, కోపము వీటిని విడిచిపెట్టమని భగవంతుడుచెపుతున్నాడు. మనకు భయం ఉంటే ఎంత సాధన చేసినా రేణింపు ఉండదు. రాగం ఉన్నప్పడు నీ మనస్సు నిర్మలం అవ్వదు. మనింట్లో ఎవరైనా చనిపోతే మనకు దుఃఖం వస్తుంది. ఏదైనా రైలు యాక్సిడెంట్‌లో 1000 మంది చనిపోయిన అయ్యో అనికూడా మన మనస్సుకు అనిపించదు. అదే రాగము. మనకు ఉన్నది ప్రేమకాదు రాగం. చాలామంది రాగాన్ని ప్రేమ అనుకొంటారు. రాగం వేరు, ప్రేమ వేరు చాలా మందికి బేధం తెలియదు. రాగం అంటే మమకారం. మమకారాన్ని ప్రేమ అనుకోవద్దు. వీటిని ఎంత తొందరగా విడిచిపెడితే అంత తొందరగా నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు స్ఫురిస్తుంది. అవసరమయితే మాట్లాడవచ్చు, అవసరం లేకుండా మాట్లాడితే వ్యక్తి భావన పెరుగుతుంది. ఎవరైనా అవసరంలేని మాటలు మాట్లాడుతూ ఉంటే ఎందుకు ఈ వ్యర్థమైన మాటలు అని మనం అంటాము. కాని భగవాన్ అలా అనరు. నువ్వు మాట్లాడే మాటలు జ్ఞానమా ? అంటారు. సత్యం అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నీ శరీరాన్ని, మనస్సును ఉపయోగించుకో. సత్యానుభవం పొందకుండా నువ్వు శరీరం విడిచిపెడితే నువ్వు పొందింది సున్న తప్పించి ఏమిలేదు. సత్యానుభవం పొందకుండా జీవితంలో ఏది సాధించినా అవి అన్నీ స్వప్న సమానము, ఒకటి లేని సున్నలు. మీరు ఏమీ ఉపన్యాసాలు చెప్పటం లేదు, దేశం అంతా తిరిగి చెప్పవచ్చు కదా అని భగవాన్‌ను అడుగుతున్నారు. నేను ఏమీ మాట్లాడటంలేదు అని నీవు ఏదో మాట్లాడుతున్నావు. నువ్వు మాట్లాడే మాట వలన దొంగనేను పెరుగుతోందా ? లేక ఆ మాట నిజం తెలుసుకోవటానికి నీకు సహకరిస్తోందా అది చూసుకో. నీవు మాట్లాడే మాట వలన నీలో ఉన్న అజ్ఞానం పెరగకూడదు. నీవు మాట్లాడే మాట నీకు అయినా ఉపయోగపడాలి లేదా సమాజానికైనా ఉపయోగపడాలి లేకపోతే ఎందుకు ఈ వ్యర్థమైన మాటలు, పనులు, ఆలోచనలు. జ్ఞానం పొందినవాడు నువ్వు జ్ఞానాన్ని సంపాదించుకో అని చెప్పడు ఇవ్వటమే వాడి పని. బోధించటం అంటే కేవలం ప్రసంగాలు చేయటం కాదు; లోపలనుండి సహృదయం, సద్బుద్ధి, కలుగజేసి సత్యానుభవం పొందటానికి తగిన శక్తిని ఇస్తాడు. ఆత్మనిష్ఠ కుదిరినవాడు ఎక్కడ మారుమూల ఉన్నా, గుహలో కూర్చొన్న వాడిద్వారా లోకానికి మేలు జరుగుతుంది. మాటలు చెప్పకపోయినా మౌనం తోటి అనుగ్రహిస్తూ ఉంటాడు, మౌనంయొక్క శక్తి అటువంటిది.

అజ్ఞానం నిజంగాలేదు. ఉంటే అదిపోదు.
మనం ఎవరిమో మనకు
తెలియకపోవటమే అజ్ఞానము.

ఎవరిని చూస్తే నీకు
మినహాయింపులులేని ప్రేమ
కలుగుతోందో, ఎవరి సమక్షంలో నీకు
శాంతి కుదురుతోందో వారిని నీవు
గురువుగా పరిగణించవచ్చును.